క్లుప్తంగా

ఫుడ్‌బ్యాంక్‌లు అన్నార్తులకు ఆశాదీపాలు


ఫుడ్‌బ్యాంక్ ద్వారా ఆహారం వడ్డిస్తున్న దృశ్యం

విజయనగరం: అన్నార్తుల ఆకలి బాధలు తీర్చేందుకు ఫుడ్ బ్యాంక్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని వైఎస్సార్‌సీపీ విజయనగరం నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కనకల కృష్ణ అన్నారు. సోషల్ మీడియా ప్రతినిధి నవీన్ స్వయంగా అందించిన ఆహారాన్ని కోట వద్ద ఉన్న ఫుడ్ బ్యాంక్ ద్వారా పేదలకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ, నవీన్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఫుడ్ బ్యాంకులకు ఆహారాన్ని అందించి అన్నదాతలుగా మారాలని కోరారు.

డెంగీ కేసులు గుర్తించాలి..


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా మలేరియా నివారణ అధికారి తులసి

పూసపాటిరేగ: మలేరియా, డెంగీ కేసులను క్షేత్రస్థాయిలోనే గుర్తించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి ఎం. తులసి అన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఆస్పత్రిలో ల్యాబ్‌ను పరిశీలించి మలేరియా, డెంగీ కేసులపై ఆరా తీశారు. ఆస్పత్రిలో వ్యాక్సిన్ నిల్వలు, వ్యాధి నిరోధక టీకాల వినియోగంపై వైద్యాధికారి రాజేష్‌వర్మను అడిగారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంఓ డీవీ రమణ, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నేత సన్నిబాబు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఏఐటీయూసీ మండల నాయకుడు తాళ్లాడ సన్నిబాబు డిమాండ్ చేశారు. పట్టణంలోని స్థానిక స్టేట్ బ్యాంక్ వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యమం ప్రారంభమై 700 రోజులు గడుస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం


ప్రథమ చికిత్సపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి

విజయనగరం ఫోర్ట్: ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రెడ్‌క్రాస్ వైద్యుడు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో ప్రథమచికిత్సపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గాయాలైనప్పుడు ఎటువంటి వైద్యం అందించాలి.. పాము కరిచినప్పుడు, గుండెపోటు వచ్చినప్పుడు అందించాల్సిన ప్రాథమిక చికిత్సపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్, హోంగార్డ్స్ సంక్షేమానికే కోఆపరేటివ్ సొసైటీ

- ఎస్పీ దీపిక


విద్యార్థులకు నగదు అందజేస్తున్న ఎస్పీ దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ ఉద్యోగులు, హోంగార్డ్స్ సంక్షేమానికే కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఉందని ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. అనంతరం చదువులో రాణిస్తున్న పోలీస్ సిబ్బంది పిల్లలకు స్కాలర్‌షిపులు అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎంఎం.సోల్మన్, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఎస్‌బీ సీఐ రుద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధన

విజయనగరం టౌన్: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దేవీ దండుమారమ్మ ఆలయం వద్ద శనివారం అన్నసమారాధన నిర్వహించారు. ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి ముఖ్య అతిథిగా పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినుల సత్తా...

- క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంజేపీఏపీ ఇంటర్ విద్యార్థినుల ఎంపిక
- హెచ్‌సీఎల్‌లో ఏడాదికి రూ 1.7 నుంచి 2.2 లక్షల రూపాయల జీతంతో ఉద్యోగాలు


ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులు

నెల్లిమర్ల: పట్టణంలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థినులు ఒకేసారి 40 మంది ఉద్యోగాలు సాధించి భళా అనిపించుకున్నారు. తాజాగా హెచ్‌సీఎల్ అనే బహుళ జాతి సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపీసీ, ఎంఈసీ విద్యార్థినులు సత్తా చాటారు. ఇంటర్మీడియట్ విద్యార్హతతోనే ఏడాదికి రూ 1.7 నుంచి 2.2 లక్షల జీతం లభించే ఉద్యోగాలు సాధించి, తమ తల్లిదండ్రులు, అధ్యాపకుల మన్ననలు పొందారు. అంతేగాకుండా ఓవైపు ఉద్యోగం చేసుకుంటూనే మరోవైపు చదువుకునే అవకాశాన్ని కూడా సదరు సంస్థ కల్పిస్తోంది. వివరాల్లోకి వెళితే.. స్థానిక మిమ్స్ వైద్య కళాశాల సమీపంలోనున్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో 2017లో జూనియర్ కళాశాల ప్రారంభమైంది. ఈ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులున్నాయి. ఈ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులకు అవసరమైన అన్ని సౌకర్యాలనూ ప్రభుత్వమే సమకూరుస్తోంది. కార్పొరేటుకు ధీటుగా ఉచిత విద్యతో పాటు పౌష్టికాహారంతో కూడిన భోజనం అందిస్తున్నారు. నీట్, ఐఐటీ, ఎంసెట్, డైట్, తదితర ప్రవేశాల కోసం ఉచితంగా కోచింగ్ ఇవ్వడమే గాకుండా అవసరమైన మెటీరియల్ అందజేస్తున్నారు. అంతేగాకుండా వారికి అవసరమైన పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫామ్స్, వసతి కోసం అవసరమైన బెడ్లు, దుప్పట్లు కూడా ప్రభుత్వమే సమకూరుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో ఈ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో తమ సత్తా చాటుతున్నారు. తాజాగా కళాశాలలో హెచ్‌సీఎల్ అనే బహుళ జాతి సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఏకంగా 40 మంది విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. ఎంపీసీ గ్రూపునకు చెందిన 29 మంది, ఎంఈసీ గ్రూపునకు చెందిన మరో 11 మంది ఉద్యోగాలు పొందారు. ఎంపికైన వారికి ఆరు నెలల పాటు సీఆర్‌టీ శిక్షణ ఉంటుంది. మరో ఆరు నెలల పాటు ఓజేటీ శిక్షణ అందిస్తారు. ఈ శిక్షణలో నెలకు రూ. 10 వేల స్టైఫండ్ చెల్లిస్తారు. శిక్షణ అనంతరం ఏడాదికి రూ 1.7 నుంచి 2.2 లక్షల రూపాయల జీతం అందిస్తారు. అంతేగాకుండా ఓ వైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు చదువుకునే అవకాశాన్ని సదరు సంస్థ కల్పిస్తోంది. బీఎస్సీ కంప్యూటర్స్, బిట్స్ పిలానీ, శాస్త్ర, అమిటీ, ఐఐఎం నాగపూర్, కేఎల్ యూనివర్సిటీల్లో వివిధ కోర్సుల్లో చేరడానికి అవకాశం కల్పించనుంది. చదువుకు అయ్యే ఖర్చంతా సంస్థే భరిస్తుంది. ఈ కళాశాలలో మొట్టమొదటి సారిగా నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లోనే 40 మంది విద్యార్థినులు ఒకేసారి ఉద్యోగాలు సాధించడంతో తల్లిదండ్రులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులపై అభినందనల జల్లు కురిపిస్తున్నారు.



ఎంజేపీఏపీ గురుకుల కళాశాల

ఆనందంగా ఉంది..


మా కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థినులు ఉద్యోగాలు సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. హెచ్‌సీఎల్ అనే కంపెనీ తాజాగా నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఒకేసారి 40 మంది జూనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా ఉద్యోగాలు సాధించారు. శిక్షణ అనంతరం వారందరికీ ఏడాదికి రూ 1.7 నుంచి 2.2 లక్షల రూపాయల జీతంతో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు సంస్థ ప్రకటించింది. హెచ్‌సీఎల్ కంపెనీని కళాశాలకు రప్పించిన ఎంజేపీఏపీ సొసైటీ కార్యదర్శి ఎ. కృష్ణమోహన్‌కు కళాశాల తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– డాక్టర్ కేబీబీ రావు, ప్రిన్సిపాల్, ఎంజేపీఏపీ కళాశాల, నెల్లిమర్ల

ఆత్మ విశ్వాసం పెరిగింది..


ఇంటర్మీడియట్ పూర్తవగానే హెచ్‌సీఎల్‌లో ఉద్యోగం సాధించడంతో నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఉద్యోగం చేస్తూ చదువుకోవడానికి సదరు సంస్థ అవకాశం కల్పించడం ఆనందంగా ఉంది.

– బి సారిక, ఎంపీసీ విద్యార్థిని

బాగా చదువుకుంటా..


మా కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగం లభించింది. కష్టపడి ఉద్యోగం చేస్తూనే ఉన్నత చదువులు చదువుకుంటాం. సంస్థే ఉన్నత చదువులు చదివిస్తానని భరోసా ఇవ్వడం ఆనందంగా ఉంది.

– ఎల్ శ్రీలత, ఎంపీసీ విద్యార్థిని

ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నాం..


38వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, తదితరులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- నగరంలోని మూడు డివిజన్‌లలో రూ.60.30 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

విజయనగరం: ప్రాధాన్యతాక్రమంలో ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శంకుస్థాపన వారోత్సవాలలో భాగంగా నగరంలోని మూడు డివిజన్‌లలో రూ. 60.38 లక్షలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ఇసరాపు రేవతీదేవి, స్థానిక కార్పొరేటర్లు శనివారం శంకుస్థాపన చేశారు. 38వ డివిజన్‌లోని బొబ్బాది పేటలో రూ.24.10 లక్షలతో.. 40వ డివిజన్‌లో రూ.1.50 లక్షలతో రహదారుల నిర్మాణానికి, 41వ డివిజన్‌లో రూ. 24.78 లక్షలతో రోడ్లు, సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు బి. ధనలక్ష్మి, ఎస్.నారాయణస్వామి మాట్లాడుతూ, నగరంలో ఎన్నడూ లేనివిధంగా అన్ని ప్రాంతాలనూ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అభివృద్ధి చేసి చూపిస్తున్నారన్నారు. కార్యక్రమాల్లో 38వ డివిజన్ కార్పొరేటర్ తొగురోతు సంధ్యారాణి, జోనల్ ఇన్‌చార్జ్‌లు డాక్టర్ వీఎస్ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణప్పడు, కార్పొరేషన్ ఈఈ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు


గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషక విలువలతో కూడా నాణ్యమైన ఆహారం అందించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. స్థానిక దాసన్నపేట అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతల కోసం ఎంతో ఖర్చు చేస్తోందన్నారు. లబ్ధిదారులందరూ పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి బి. శాంతకుమారి మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న ఫోర్టిఫైడ్ రైస్‌ను లబ్ధిదారులంతా వినియోగించుకోవాలన్నారు. ఆయా కాలాల్లో లభించే కూరగాయలు, పండ్లను తీసుకోవాలని సూచించారు. అనంతరం రాగులు, జొన్నలు, తదితర చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను ప్రదర్శించగా.. చైర్మన్, పీడీలు ఆసక్తిగా తిలకించారు. అలాగే గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. ఆరోగ్యవంతమైన పిల్లలకు వెల్‌బేబీ షో నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గాదం మురళి, బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ జి. హిమబిందు, సభ్యులు భవానీ, సుధారాణి, సీడీపీఓ గుల్లిపల్లి ప్రసన్న, ఏసీడీపీఓ సత్యవతి, సూపర్‌వైజర్లు గనివాడ ఎర్రయ్యమ్మ, మేరీ, అనురాధ, శారదలు పాల్గొన్నారు.

ఒత్తిడి వీడితే ఉత్తమ ఫలితాలు..

- మూడో తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు
- ప్రణాళికాబద్ధంగా చదవాలి: నిపుణులు

భోగాపురం: విద్యార్థులకు పదో తరగతి ప్రత్యేకం. మంచి మార్కులతో ఉత్తీర్ణులైతే ఆత్మవిశ్వాసం రెట్టింపు అవుతుంది. ప్రతి విద్యార్థి టెన్త్ పరీక్షలకు ప్రణాళికబద్ధంగా సిద్ధం కావాలి. ప్రతి సబ్జెక్ట్‌ను రివిజన్ చేసుకుంటే విజయం సులువవుతుంది. నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 58 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. అందులో 4,057 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఈనెల 3వ తేదీ నుంచి 18 పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ కూడా విడుదలైంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు విద్యార్థులను పరీక్షలకు మానసికంగా సిద్ధం చేస్తున్నారు. ఒత్తిడిని విడనాడి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు ఎలా రాయాలో అవగాహన కల్పిస్తున్నారు. ఈ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా సూచనలు చేస్తున్నారు.


భోగాపురం హైస్కూల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, పదో తరగతి విద్యార్థుల వివరాలు

మండలం	ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థులు
భోగాపురం	14	986
పూసపాటిరేగ	16	1,120
డెంకాడ	09	721
నెల్లిమర్ల	19	1,230
మొత్తం	58	4,057

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ..


సమ్మేటివ్ పరీక్షలు పూర్తి కావడంతో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. పరీక్షల ఒత్తిడిలో విద్యార్థులు పొరపాట్లు చేయకుండా సులభ పద్ధతిలో మంచి మార్కులు ఎలా సాధించాలన్నా అంశంపై అవగాహన కల్పిస్తున్నాం. మాదిరి పరీక్షలు నిర్వహించి, పరీక్షలంటే ఉన్న భయాన్ని తొలగించడానికి కృషి చేస్తున్నాం.

– వైదా శ్రీరామ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భోగాపురం

పర్యవేక్షిస్తున్నాం..


ప్రతి హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్, ఎంపీడీఓలతో కలిసి ప్రత్యేక తరగతులను పరిశీలిస్తూ ఉపాధ్యాయులకు సలహాలు అందిస్తున్నాం. జిల్లా విద్యాశాఖాధికారి ఇచ్చిన 60 రోజుల కార్యాచరణను అమలు చేస్తున్నాం.

– రమణమూర్తి, ఎంఈఓ, భోగాపురం

ఆసరాతో మహిళలకు ఆర్థిక భరోసా..

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ
- నగర పంచాయతీ మహిళలకు ఆసరా చెక్కు పంపిణీ


మహిళలకు ఆసరా చెక్కు పంపిణీ అందజేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్ ఆసరాతో మహిళలకు ఆర్థిక భరోసా కలుగుతుందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలను శనివారం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుతో కలిసి నగర పంచాయతీలో ఉన్న 406 సంఘాలకు గానూ రూ.2.49 కోట్ల చెక్కును ఎంపీ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ బెల్లాన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలోనే మహిళల ఆర్థిక స్వావలంబన, అభ్యున్నతి జరుగుతోందన్నారు. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం విడతల వారీగా రుణమాఫీ చేస్తున్నారని చెప్పారు. గతంలో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానన్న చంద్రబాబు మోసం చేశాడన్నారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమ పాలన జరుగుతోందన్నారు. ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నెరవేర్చారని చెప్పారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని మహిళలు గమనించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ బాలాజీప్రసాద్, చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్ రామారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సాంబశివరావు, కార్పొరేషన్ డైరెక్టర్ జానా ప్రసాద్, జేసీఎస్ కన్వీనర్ గణేష్, నగర పంచాయతీ మేనేజర్ విశ్వేశ్వరరావు, మెప్మా సీఎండీ గోవింద్, తదితరులు పాల్గొన్నారు.


హాజరైన నగర పంచాయతీ మహిళలు

ఆస్తులు పరిరక్షించుకుంటాం..

విజయనగరం టౌన్: సీబీసీఎన్‌సీ చర్చి ఆస్తులను పరిరక్షించుకుంటామని సంఘమిత్ర ఆర్ ఎస్.జాన్ అన్నారు. శనివారం స్థానిక సిమ్స్ బాప్టిస్ట్ చర్చి ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సీబీసీఎన్‌సీకి చెందిన స్థలమైన విశాఖ హిల్‌క్రాస్ బంగ్లాలో నిర్మాణాలు చేపట్టడం విచారకరమన్నారు. చర్చి ఆస్తులను కాపాడుకునేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. 2న అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు.. 9న ప్రజాప్రతినిధులకు విన్నవించడం.. 16న అన్ని నల్లబ్యాడ్జీలతో నిరసన.. 17న కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రికి అర్జీలు సమర్పించడం.. 23న రిలే నిరాహార దీక్షలు, చలో విశాఖ దీక్షలు, విజయవాడలో ధర్నాచౌక్ వద్ద నిరసన దీక్షలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పాస్టర్ ఎం.అప్పలనాయుడు, జయరత్నకుమార్, టి.ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సహాయం


బాధితులకు కిట్లు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్‌సొసైటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు

మెరకముడిదాం: మండలంలోని గరుగుబిల్లి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో పూరిళ్లతో పాటు సర్వం కోల్పోయిన మూడు కుటుంబాలకు రెడ్‌క్రాస్ సొసైటీ సహాయం అందజేసింది. నిత్యావసర సరుకులతో పాటు వంట పాత్రలు, ఇతర సామగ్రితో కూడిన కిట్‌ను రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు బి.వి.గోవిందరాజులు, ముడిదాపురాము, ఎంపీటీసీ చందక చిరంజీవినాయుడు, సర్పంచ్ ఆవాల అప్పలనాయుడు కలిసి బాధితులకు శనివారం అందజేశారు.

గడప గడపలో సంతోషమే లక్ష్యం...


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జరిగిన లబ్ధిని వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: గడప గడపలో సంతోషాన్ని చూడడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 20వ డివిజన్ శాంతినగర్‌లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. శనివారం సాయంత్రం డివిజన్‌కు చేరుకున్న ఆయనకు స్థానికులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కోలగట్ల, తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలతో కూడిన బుక్‌లెట్‌లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. ఓ వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమం అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శపాలన అందిస్తున్నారన్నారు. అందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల ముంగిటకు ధైర్యంగా వెళుతున్నామన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని చెప్పారు. కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజు మాట్లాడుతూ, తమ డివిజన్‌లో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని.. దీంతో ప్రజలంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. సుమారు 300 మంది వరకు ఇళ్ల పట్టాలు పొందారన్నారు. అలాగే అర్హత ఉన్నవారందరికీ వృద్ధాప్య, వితంతు పింఛన్లు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతీదేవి, డివిజన్ అధ్యక్షుడు పచ్చిగుళ్ల కృష్ణమూర్తి, కాళ్ల సూరిబాబు, మహిళా అధ్యక్షురాలు గుండు విమల, గుండు శ్రీను, యువజన అధ్యక్షుడు సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

గెడ్డవాగు ఆక్రమణలపై సర్వే

కొత్తవలస: కొత్తవలస గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 142–1లోని గెడ్డవాగు ఆక్రమణలపై అందిన ఫిర్యాదుల మేరకు తహసీల్దార్ హేమంత్‌కుమార్ ఆదేశాల మేరకు మండల సర్వేయర్ గంగాధర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎన్.కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం సర్వే నిర్వహించారు. సుమారు 1.45 ఎకరాల గెడ్డవాగును సిబ్బంది పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి హద్దులను నిర్ధారించారు. గెడ్డవాగులో కొంత భూమిని 22 మంది ఆక్రమించారని, వీరిలో కొంత మంది ఇళ్లు నిర్మించుకోగా, మరికొంతమంది నిర్మాణాలకు పూనుకుంటున్నట్టు సర్వే సిబ్బంది గుర్తించారని తహసీల్దార్ తెలిపారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు


దల్లిపేట పంచాయతీ జగనన్న కాలనీలో పర్యటిస్తున్న ఎంపీడీఓ దాసరి బంగారయ్య, తదితరులు


బూరాడపేటలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భానోజీరావు

భోగాపురం: జగనన్న కాలనీ లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ దాసరి బంగారయ్య సూచించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల అధికారులతో కలిసి మండలంలోని దల్లిపేట పంచాయతీ జగనన్న కాలనీలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను శనివారం పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ, ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థికసాయం, నిర్మాణ సామాగ్రితో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దల్లి కాంత, హౌసింగ్ ఏఈ ఆర్.రాము, ఏపీఎం రమణ, ఏపీఓ ఆదిబాబు, దల్లి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

త్వరగా పూర్తి చేసుకోవాలి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని బూరాడపేట గ్రామంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ హెచ్. భానోజీరావు పర్యటించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా ఇళ్ల నిర్మాణాలు పరిశీలించి, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.